15 నుంచి కుస్తీ పోటీలు

అత్తాపూర్‌లో కుస్తీ పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం

అత్తాపూర్: సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి 6వ కుస్తీ పోటీలను ఈ నెల 15, 16, 17వ తేదీల్లో నిర్వహించనున్నామని నిర్వాహకులు నారగూడెం మల్లారెడ్డి, గోరిగే రాజు పైల్వాన్‌లు తెలిపారు. కుస్తీపోటీల ఆహ్వాన పత్రికను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌లకు సోమవారం వారు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... అత్తాపూర్‌లోని రాంబాగ్ రామాలయం గ్రౌండ్‌లో ఈ కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఏటా మూడు రోజులపాటు కుస్తీ పోటలు జరుగుతాయన్నారు. వీటిలో జంగ నగరాల నుంచి అనేక మంది ప్రముఖ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తామన్నారు. సాబాద విజయ్‌కుమార్, జయానంద్‌రెడ్డి, గురు తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నాం

బండ్లగూడ జాగీరు మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తమవంతు బాధ్యతగా ,చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న హిమాయత్‌సాగర్ నీటిని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు అందించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎంపీ, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డిల సహకారంతో ఈ పనులు ప్రారంభించామన్నారు. ఈ మేరకు సోమవారం ఫిల్టర్ బెడ్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఈ మంచినీటి సరఫరాలో ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ. 2 కోట్లతో ఫిల్టర్ బెడ్, రూ. 4.50 కోట్లను పైప్‌లైన్ కోసం కేటాయించామన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి సమస్య లేకుండా చేసేందుకు తమవంతు కృషిగా ఈ ఫిల్టర్ బెడ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాను మేయర్‌గా ఎన్నికైన తరువాత ఇచ్చిన హామీ మేరకు హిమాయత్‌సాగర్ నీటిని కార్పొరేషన్ ప్రజలకు అందిస్తానని హామీ ఇచ్చామన్నారు. ఆ హామీని నెరవేరుస్తున్నామన్నారు. ఈ ఫిల్టర్ బెడ్స్ నిర్మించిన తరువాత ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, రాష్ట్ర మంత్రులతో కలిసి ప్రారంభిస్తామని మేయర్ వెల్లడించారు.


ఫిల్టర్ బెడ్ ఏర్పాటుపై స్థలాన్ని పరిశీలిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్ తదితరులు

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి


అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

శంషాబాద్: మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని శంషాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్కూల్ అసిస్టెంట్‌లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులతో ఎక్కువ సమయం గడిపే ఉపాధ్యాయులు వారి ప్రవర్తన, ఇతర పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు సూచించారు. ఉద్యోగం, ప్రేమ, పెళ్లి, డబ్బు ఆశచూపుతూ వివిధ మాధ్యమాల ద్వారా ఇలాంటి ఉచ్చులో పడి అనేకమంది జీవితాలు ఆగమవుతున్నాయన్నారు. విస్తరిస్తున్న సైబర్ ట్రాఫికింగ్‌పై కూడా విద్యార్థులను చైతన్యపర్చాలని ప్రజ్వల సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి సూచించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

అత్తాపూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీలత అన్నారు. పాఠశాలకు చెందిన ఇద్దరు అన్నదమ్ములు విలు విద్యలో రాణిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. 9వ తరగతి చదువుతున్న నాగసాయి, 6వ తరగతి చదువుతున్న శేషసాయిలు విలు విద్యలో ప్రతిభను కనబరుస్తూ రికర్వ్ విభాగంలో తమ శక్తి సామర్థ్యాలను మరింత పురోగమిస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ఐ స్కూల్ గేమ్స్‌లో శేషసాయి జిల్లా, రాష్ట్ర స్థాయిలలో రజత పతకాన్ని సాధించాడన్నారు. తెలంగాణ రాష్ట్రం తరఫున జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత సాధించాడన్నారు. భారత్‌కు ఒలింపిక్ పతకం అందించడమే లక్ష్యంగా ఎంతో కృషి చేస్తున్నారని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈ పోటీలు 20, 21వ తేదీల్లో కొనసాగుతాయని హెచ్‌ఎం వెల్లడించారు. ఉపాధ్యాయులు ఎస్.సాయిప్రసాద్ రావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


నేషనల్స్‌కు ఎంపికైన శేషసాయిని అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీలత, ఉపాధ్యాయులు

తాగునీటి సమస్యలు పరిష్కరించాలని వినతి


జలమండలి డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను పరిష్కరించేలా సక్రమంగా నీటి సరఫరా ప్రారంభించాలని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ డైరెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మణికొండలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఓఆర్ఆర్ ఫేస్–3 తాగునీటి సరఫరా ప్రాజెక్టు 2.5 మిలియన్ లీటర్ల నీటి రిజర్వాయర్‌ను నిర్మించారన్నారు. ఈ పనులను పూర్తి అయినా నీటి సరఫరాను అధికారులకు ప్రారంభించలేదన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నీటిని సరఫరా చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇదే విషయాన్ని జలమండలి డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం ద్వారా వివరించామని ఆయన వెల్లడించారు. ఈ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా ప్రారంభించడానికి అవసరమైన అనుమతులను ట్రాన్స్‌మిషన్ డిపార్ట్‌మెంట్‌ను కోరామన్నారు. ఈ అనుమతులు రాగానే నీటి సరఫరా ప్రారంభిస్తామని జలమండలి డైరెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీకాంత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

21, 22వ తేదీల్లో ఔత్సాహిక

పారిశ్రామిక వేత్తలకు సదస్సు

మణికొండ: గండిపేట్‌లోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22వ తేదీల్లో నిర్వహించే స్టార్ట్ అఫ్ స్పార్క్, మైక్రో కాజం 2.0 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.పి.సింగ్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ వెంకటరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంకుర పరిశ్రమలను, ఇన్వెస్టర్లను అనుసంధానం చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మైక్రో కాజోమ్ 2.0 కన్వీనర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.బాలరాజు మాట్లాడుతూ... సంవత్సరం నిర్వహించే ఈ సాంకేతిక కార్యక్రమంలో ప్రాజెక్టు ఎక్స్‌పో, పేపర్ అండ్ పోస్టల్ ప్రజంటేషన్, మేక్ ఏ తాన్, సర్క్యూట్ రిలే, ఫైండ్ ద ఫాల్ట్ వంటి మరెన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వివిధ కళాశాలల విద్యార్థినీవిద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొంటారన్నారు. స్టూడెంట్ కో ఆర్డినేటర్స్ వెంకట శ్రీరామ్, వివేకానందరెడ్డి, సంజన, అనూఫ్ దోరేపల్లి తదితరులు పాల్గొన్నారు.


ఎంజీఐటీలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖాళీ జాగా.. వేసెయ్ చెత్త!

- ఇష్టారాజ్యంగా వ్యర్థాల పారబోత
- రోడ్లపైనే ప్లాస్టిక్ కవర్లు
- మూగజీవాలకు ప్రాణాంతకం
- చెత్త వేసే ప్రాంతం దుర్గంధభరితం

బండ్లగూడ: అభివృద్ధి చెందుతున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు వాటిలో చెత్త వేసేస్తున్నారు. ఇలా దాదాపు అన్ని జాగాల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. నిత్యం పరిసరాలు శుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో పారిశుద్ధ్య కార్మికులు ప్రతి ఇంటికీ తిరుగుతూ చెత్త సేకరణ చేస్తున్నారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై పలు కార్యక్రమాలు చేపడుతూ కాలనీల్లోని ప్రజలు ఇళ్లలో నుంచి చెత్తను వీధుల్లో వేయకూడదని పలు మార్లు కార్పొరేషన్ సిబ్బంది అవగాహన కల్పించినా, కొందరి జనాల్లో మాత్రం ఇళ్ల మధ్య ఖాళీ స్థలం ఉందా.. వేయండి చెత్త అనే ధోరణి కనిపిస్తుంది.

నిత్యం శుభ్రం చేస్తున్నా...

చెత్త సేకరణలో భాగంగా రోడ్డుపై, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను రోజురోజు పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేస్తున్నప్పటికీ మళ్లీ రోడ్లపై కుప్పలు తెప్పలుగా చెత్త వేస్తున్నారు. సంపూర్ణ పారిశుద్ధ్య మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు ఓవైపు తగు చర్యలకు ఉపక్రమిస్తున్నా ఆశించిన ఫలితాలు మాత్రం చూపలేకపోతున్నారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగమూ ఎక్కువే..

ఒరకంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ప్లాస్టిక్ అడ్డంకిగా ఉందని చెప్పొచ్చు. ప్లాస్టిక్ కవర్ల వాడకం కూడా కార్పొరేషన్ పరిధిలో ఎక్కువగా ఉంది. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలని ప్రభుత్వాలు తగు ప్రచారం కల్పిస్తున్నా అది అమలు కావడం లేదు. ప్రతిదీ ప్లాస్టిక్ కవర్లలోనే ప్యాక్ చేసి ఇస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు దాడులు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నా వ్యాపారులు, హోటళ్ల యజమానులు, పళ్ల దుకాణదారులు ఒకటేమిటి మటన్, చికెన్ వ్యాపారులు అంతా ప్లాస్టిక్ కవర్లను వాడుతూనే ఉన్నారు. కాలనీలలో రోడ్లపై ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే కనిపిస్తున్నాయి.

84 స్వచ్ఛ ఆటోలు, 173 మంది పారిశుద్ధ్య కార్మికులు..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు కార్పొరేషన్‌కు 10 ఆటోలు ఉన్నాయి. మరో 74 ప్రైవేటు వాహనాలు వాటి డ్రైవర్లు చెత్తను తరలిస్తున్నారు. స్వచ్ఛ ఆటోకు నిర్దేశిత రుసుము నెలకు రూ. 100 ఖరారు చేసింది. రోడ్డు, వీధులు శుభ్రత తదితర పనులు చేసేందుకు కార్పొరేషన్ పరిధి 173 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు.


ప్రశాంత్‌నగర్ కాలనీలో రోడ్డుపై చెత్త శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

మూగ జీవాలను కాపాడండి...

చెత్తలో విసిరిన ప్లాస్టిక్ సంచులను తింటున్న మూగ జీవాల ప్రాణాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. పశువుల పొట్టలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల చనిపోయిన దూడల గురించి చాలానే విన్నాం. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణంతో పాటు ప్రజలకు కూడా ప్రమాదం వాటిల్లుతోందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇంటింటికీ చెత్తను సేకరించే వ్యవస్థ ఉంది. దీనికి నివాసితులకు నెలకు రూ. 100 చెల్లించాలి. అయితే కొంత మంది నివాసితులు ఈ మొత్తాన్ని చెల్లించేందుకు ఇష్టపడకుండా తెల్లవారుజామున, రాత్రి సమయంలో చెత్తను రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో వేసేస్తున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం



పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది. స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు యూజర్ చార్జీలు చెల్లించి చెత్త పారిశుద్ధ్య కార్మికులకు అందించాలి. రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటా. ప్లాస్టిక్ కవర్లను వాడకుండా, క్లాత్, పేపర్ బ్యాగులను మాత్రమే వినియోగించి పర్యావరణాన్ని తద్వారా మానవాళిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదై ఉంది.

– బచ్చలకూరి శరత్‌చంద్ర, కమిషనర్ బండ్లగూడ జాగీర్


రోడ్డుపై ఉన్న చెత్తలో మూగ జీవులు


వికాస్‌నగర్ కాలనీ రోడ్డుపై...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాయుడు కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఇంటి అద్దె విషయంలో గొడవ

పరస్పరం దాడి: ఇద్దరికి గాయాలు

అత్తాపూర్: అద్దె ఇవ్వకపోవడంతో ఇల్లు ఖాళీ చేయమని యజమాని హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో ఇద్దరికి గాయాలయ్యాయి. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రామిరెడ్డి సమాచారం మేరకు... హసన్‌నగర్‌లో జహంగీర్ బీ కుటుంబంతో నివసిస్తున్నాడు. ఆమె ఇంట్లో అహమద్‌బీ నివసిస్తున్నాడు. రెండు నెలలుగా అహ్మద్ బీ ఇంటి అద్దె చెల్లించడం లేదు. దీంతో జహంగీర్ బీ అద్దె చెల్లించాలని అడగడంతో ఇరువర్గాల మధ్య సోమవారం గొడవ జరిగింది. ఇరువురి కుటుంబీకులు ఇకరి ఒకరు దాడి చేసుకున్నారు. ఇందులో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఆయా కుటుంబాలపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రామిరెడ్డి తెలిపారు.

హెచ్‌సీయూ విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌గా ప్రొ.అరుణ్‌ఘోష్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌గా అమెరికాలోని ఫరీద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అరుణ్‌ఘోష్‌కు అవకాశం లభించిందని సోమవారం హెచ్‌సీయూ ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికాలో ప్రొఫెసర్ అరుణ్ ఘోష్ ఇయాన్ పి.రోత్‌వెల్ విశిష్ట ప్రొఫెసర్‌గా, ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో పనిచేస్తున్నారు. ఆయన పరిశోధనా బృందం సింథటిక్ ఆర్గానిక్, బయో ఆర్గానిక్, మెడిసినల్ కెమిస్ట్రీ రంగాలలో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ప్రాజెక్ట్‌లలో పాల్గొంటోంది. ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌షిప్ కెమిస్ట్రీలో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు/ప్రొఫెసర్లకు ఇవ్వబడుతుంది.ఒక ఏడాది కాలంలో వరుసగా ఇద్దరు సందర్శకులను నియమించవచ్చు.

అన్నదానం



గోల్కొండ: ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత జీవనాన్ని ప్రజా సేవకే కేటాయిస్తానని ప్రభుత్వ సెకండ్ లాన్సర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ సంఘ సేవకుడు మహ్మద్ బషీర్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ, మెహిదీపట్నం, నాంపల్లి తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను హైస్కూల్‌లో చదివే రోజుల్లోనే తమ ఉపాధ్యాయుల నుంచి సేవా గుణాన్ని నేర్చుకున్నానన్నారు. తోటి ఉద్యోగులు, శ్రేయోభిలాషులు, పలు ఎన్ఆర్ఐల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు.

సేవా కార్యక్రమాలతో ప్రశాంతత

మణికొండ: ప్రజా సేవ చేయడం ద్వారా మనశిక ప్రశాంతత కలుగుతుందని మణికొండలోని ప్రభు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ ప్రభుకుమార్ అన్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి కామన్ వెల్త్ మెడికల్ అసోసియేషన్ (సీఎంఏ) యూనైటెడ్ కింగ్డమ్ ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జె.ఎ జయలాల్, ఐఎంఏ జాతీయ నాయకులు, కామన్‌వెల్త్ మెడికల్ అసోసియేషన్ అంతర్జాతీయ నాయకులు, ది తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ నారాయణస్వామిల చేతుల ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఐదు వేల పైచిలుకు మెడికల్ క్యాంప్‌లు నిర్వహించామన్నారు. వేలాదిగా అవగాహన కార్యక్రమాలు, అనేక ప్రసార మాధ్యమాల్లో ఆరోగ్య అవగాహన చర్చలు, సదస్సుల్లో పాల్గొన్నానని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభును కామన్ వెల్త్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధిగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధుల బృందం పాల్గొన్నారు.


డాక్టర్ ప్రభుకుమార్‌ను అభినందిస్తున్న మెడికల్ అసోసియేషన్ సభ్యులు

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం


సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: అనాదిగా ఆయుర్వేద వైద్యం అందుబాటులో ఉందని డాక్టర్ గాయత్రి పేర్కొన్నారు. సోమవారం మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ బండ్లగూడలో నేషనల్ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో సమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశంలో ప్రాచీన కాలం నుంచి మునులు, ఋషులు వన మూలికల ద్వారా చికిత్స అందించేవారని గుర్తుచేశారు. వన మూలికలతో దీర్ఘకాలిక జబ్బులు సైతం నయం చేసే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వైద్యాన్ని ప్రోత్సహించేవారని.. రోగులు పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేవారని అన్నారు. ప్రస్తుత సమాజంలో ఆయుర్వేదం ద్వారా అనేక చికిత్సలు చేస్తున్నారని తెలిపారు. ఎంఎస్ఎస్ కో ఆర్డినేటర్ వీరేంద్రపాటిల్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని అన్నారు. కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ధనుంజయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు ఎనలేనివి

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. కమాండెంట్ సీ సన్నీ ఆధ్వర్యంలో సర్దార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ బివిరెడ్డి, సహాయ కమాండెంట్ ఎం నాగభూషణం, బి సిత్రం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు: డీసీ


ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీసీ రవికుమార్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరిస్తున్నామన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రెండు, టౌన్ ప్లానింగ్ విభాగంలో రెండు ఫిర్యాదులను అందాయన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అబాకస్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు


అక్షయరెడ్డిని అభినందిస్తున్న శ్రీవాణి

మణికొండ: కోల్‌కత్తా కేంద్రంగా జరిగిన అంతర్జాతీయ సిప్ అబాకస్ పోటీలలో మణికొండ విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం రాత్రి జరిగిన పోటీలలో మణికొండ కేంద్రానికి చెందిన అక్షయరెడ్డి అడ్వాన్స్ లెవల్ 1వ కేటగిరీలో 2వ బహుమతిని సాధించింది. అదే లెవల్‌లో 4వ కేటగిరిలో తోషి గణేష్‌నందన్ 3వ స్థానం దక్కించుకున్నాడు. 3వ కేటగిరిలో అక్షయరెడ్డి 3వ బహుమతి, అక్షయ బోయపాటి రెండవ కేటగిరీలో 3వ బహుమతిని సాధించారు. వీరిలో పాటు రోహిత్‌సాయి, అఖిలేష్, సాహిత్, నిహాల్, విరాట్ కొల్లాలకు పాల్గొన్నందుకు అవార్డులు దక్కాయని సెంటర్ హెడ్ గడ్డి శ్రీవాణి కరణ్‌కుమార్ తెలిపారు. సిప్ అబాకస్ స్థాపించిన 21 సంవత్సరాలలో తొలిసారి ఇలాంటి పోటీలు జరిగాయని, అందులో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆమె సోమవారం కేంద్రంలో ప్రత్యేకంగా అభినందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

గోల్కొండ: చిన్న పిల్లల్లో క్రికెట్‌పై ఆసక్తి పెరుగుతుందని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో దేవర వంశీ నాయకత్వంలో నిర్వహించిన దేవర కరుణాకర్ మెమోరియల్ క్రికెట్ విజేతలకు సోమవారం ఆయన బహుమతులు అందజేశారు. తాళ్లగడ్డలోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో న్యూ హిడన్ మోడల్ హైస్కూల్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. భారత దేశంలో క్రికెట్‌కు ఉన్న క్రేజ్ మరే దేశంలో లేదన్నారు. గత పదేళ్లలో ప్రధాని మోదీ కేవలం క్రికెట్‌కే కాకుండా అన్ని క్రీడలకు ప్రోత్సాహం ఇస్తున్నారన్నారు. బీజేవైఎం గోల్కొండ జిల్లా అధ్యక్షులు నితిన్‌నందేకర్, సెంట్రల్ జిల్లా అధ్యక్షులు సందీప్‌యాదవ్ తదితరులున్నారు.

అగ్నిప్రమాదంలో స్క్రాప్ గోదాములు ఆహుతి

అత్తాపూర్: ఓ స్క్రాప్ దుకాణంలో మంటలు చెలరేగి భారీ అగ్నిప్రమాదానికి కారణమైంది. అయితే ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రామిరెడ్డి సమాచారం మేరకు... అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివరాంపల్లిలో నాగరాజు అనే వ్యక్తి ఓ స్క్రాప్ గోదామును నిర్వహిస్తున్నాడు. దానికి ఆనుకొని నర్సింగ్‌రావుకు చెందిన మరో స్క్రాప్ దుకాణం ఉంది. సోమవారం మధ్యాహ్నం నాగరాజు నిర్వహించే స్క్రాప్ గోదాంలో మంటలు చెలరేగాయి. అందులో పని చేసే కార్మికులు మంటలను గుర్తించి వాటిని ఆర్పడానికి తీవ్రంగా ప్రశ్నించారు. బకెట్లతో నీటిని పోసినా మంటలు చల్లారకపోగా అంతా ప్లాస్టిక్ కావడంతో వేగంగా వ్యాపించాయి. దీంతో కార్మికులు బయటకు పరిగెత్తారు. క్షణాల్లో మంటలు గోదాం మొత్తం వ్యాపించాయి. పక్కనే ఉన్న నర్సింగ్‌రావు గోదాంలోకి అగ్ని రేణువులు పడటంతో అక్కడ మంటలు చెలరేగాయి. అది కూడా ప్లాస్టిక్ గోదాం కావడంతో వేగంగా మంటలు వ్యాపించాయి. దీంతో భారీగా మంటలు చెలరేగి స్థానికంగా దట్టమైన పొగలు అలుముకున్నాయి. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరిన అగ్నిమాపక సిబ్బంది దాదాపు మూడు గంటలు పాటు శ్రమించి మంటలు అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో అంతా స్క్రాప్ కావడంతో ఆస్తి నష్టం ఎంత జరిగిందనేది యజమానులే చెప్పాల్సి ఉంది. విలువైన వస్తువులు కాలిపోలేదని పోలీసులు తెలిపారు. స్క్రాప్ దుకాణాల యజమానులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రామిరెడ్డి తెలిపారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది